క్లుప్తంగా

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 5 నుంచి జరిగే ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ దుర్గయ్య తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో పాటు మైనార్టీ గురుకుల కళాశాల, జ్యోతిబాపూలే గురుకుల కళాశాల, కస్తూర్బా గురుకుల కళాశాల విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 321 మంది, ద్వితీయ సంవత్సరంలో 228 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రజావాణికి దరఖాస్తులు నిల్



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి విద్యుత్ శాఖ డీఈ కార్యాలయంలో నిర్వహించిన విద్యుత్ ప్రజావాణికి సోమవారం ఎలాంటి ఫిర్యాదులు రాలేవని డీఈ విజయ సారథి తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 నిమిషాల వరకు ప్రజావాణి నిర్వహించారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏఈ రమణాచారి ఉన్నారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని తహసీల్దార్ మహేందర్‌కుమార్ తెలిపారు.

తాడ్వాయిలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): స్థానిక తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని తహసీల్దార్ రహీమొద్దీన్ అన్నారు. గ్రామాలలో ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే వచ్చే సోమవారం జరిగే ప్రజావాణిలో ఫిర్యాదు చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ రహీమొద్దీన్, ఎంపీడీవో సయ్యద్ సాజిద్‌అలీ, ఏవో నర్సింలు, ఎంపీవో సవితారెడ్డి, ఎంఈవో రామస్వామి, ఏపీఎం మనోహర్, ఏపీవో కృష్ణాగౌడ్, అధికారులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడిని నివారించండి



భిక్కనూరు: మండల కేంద్రంలోని జెండాగల్లీలో నెల రోజులుగా ప్రజలు నీటి ఎద్దడితో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే చర్యలు చేపట్టాలంటూ సమాచారహక్కు పరిరక్షణ కమిటీ జిల్లా ప్రతినిధి గంగళ్ల రవీందర్ సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ విషయమై భిక్కనూరు తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. చర్యలు తీసుకోవాని జీపీ కార్యదర్శి మహేశ్‌గౌడ్‌ను ఎంపీడీవో ఆదేశించారు.

సైన్స్‌ఫెయిర్‌లో విద్యార్థుల ప్రతిభ



నిజాంసాగర్(జుక్కల్): హైదరాబాద్‌లో మినీ శిల్పారామంలో జరిగిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో అచ్చంపేట ఆదర్శ మోడల్ పాఠశాల విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శన కనబర్చారని ప్రిన్సిపల్ కార్తీక సంధ్య తెలిపారు. 9 జిల్లాల నుంచి విద్యార్థులు సైన్స్ ప్రదర్శన చేయగా అచ్చంపేట మోడల్ పాఠశాల విద్యార్థులు రైల్వే యాక్సిడెంట్ నిర్మూలన ఇన్నోవేషన్ ఛాలెంజస్‌పై అద్భుతమైన, సృజనాత్మకమైన ప్రతిభ చూపారు. ఈ మేరకు అచ్చంపేట మోడల్ పాఠశాలకు ట్రోఫీని అందజేయడంతో పాటు విద్యార్థులకు షీల్డ్‌లు బహుకరించారు. విద్యార్థులతో పాట గైడ్ టీచర్ చందనను ప్రిన్సిపల్ అభినందించారు.

ఇందిరమ్మ మోడల్ భవన నిర్మాణ పనుల పరిశీలన



బీబీపేట : స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయం పక్కన నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ భవన నిర్మాణాన్ని సోమవారం ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్ పరిశీలించారు. భవనం నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని, ప్రభుత్వం పల్లెపల్లెకు నిర్మించ తలపెట్టిన భవనం నమూనా ఇలాగే ఉంటుందని పేర్కొన్నారు. అలాగే ప్రతి మండల కేంద్రంలో మోడల్ భవనం నిర్మిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లకు రూ.5 లక్షలు మంజూరవుతాయని, వాటితో ఇలాగే నిర్మించుకోవాలని సూచించారు. భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు పొట్టిగారి బాలమణి. రామారెడ్డి గ్రామం మొదటి వార్డు. 2017కి ముందు మిషన్ భగీరథ పథకం కింద నల్లా కనెక్షన్ ఇచ్చారు. అప్పటినుంచి ఇప్పటివరకు ఒక్కసారి కూడా నల్లాలో నీళ్లు రాలేదు. ఇక చేసేది లేక పంచాయతీ తరఫున వేయించిన సింగల్ ఫేజ్ మోటర్ బోరుబావి నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు గడ్కోల్ రాజమణి. ఈమెదీ అదే పరిస్థితి. మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ ఇచ్చి బిగించారు. ఒక్కసారి కూడా నీళ్లు రాలేవు. గ్రామంలో చాలా వార్డులలో మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు ఉన్నప్పటికీ వృథాగానే ఉంటున్నాయి. ఒక్కసారి కూడా నీళ్లు రాకపోవడమే మిషన్ భగీరథా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

పల్లెకు చేరని భగీరథ నీరు

మంచి నీటి కోసం ప్రజల పాట్లు

- నిరుపయోగంగా ఉన్న నల్లా కనెక్షన్లు
- భగీరథ ప్రధాన పైపులైన్లకు నిత్యం లీకేజీల గండం
- సరైన చర్యలు తీసుకోని అధికార యంత్రాంగం

గత ప్రభుత్వం మిషన్ భగీరథ పేరుతో వేసిన తాగు నీటి పైప్ లైన్లు చాలా చోట్ల నిరుపయోగంగా ఉన్నాయి. ఇన్ని సంవత్సరాలు గడిచినా పైపుల్లో నీటి చుక్క రాలేదు. కొన్ని చోట్ల అవసరం లేకున్నా పైప్‌లైన్లు వేసి కమీషన్లు దండుకున్నారు. తాగునీటి ఇబ్బందులున్న చోట పైపులు వేసినా కూడా ఇప్పటికీ ఆ పైపుల్లో నుంచి నీటి చుక్క రావడం లేదు. పైపులు ఎందుకు వేశారో తెలియని పరిస్థితి చాలా చోట్ల ఉంది. ఈ ప్రభుత్వంలోనైనా ఆ భగీరథ పైపుల్లో నుంచి తాగు నీరు వస్తుందేమో వేచి చూస్తున్నారు.

రామారెడ్డి : అధికారుల లెక్కల ప్రకారం మిషన్ భగీరథ గ్రిడ్‌ల ద్వారా జిల్లాలోని అన్ని గ్రామాలకు నీరందుతుంది. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే పంచాయతీ ట్యాంకులు సగం కూడా నిండడం లేదు. కొన్ని గ్రామాలలో శివారు ప్రాంతంలో చుక్కనీరు రాక పంచాయతీ బోరు బావులపైనే ప్రజల ఆధారపడి నీళ్లు తెచ్చుకుంటున్నారు. స్థానికంగా ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన బోరుబావుల ద్వారా ట్యాంకులు నింపుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

పైప్ లైన్లతో సరిపెట్టారు..

జిల్లా వ్యాప్తంగా ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్లు ఇచ్చి ఆదరాబాదరాగా 2017లో పనులు పూర్తి చేశారు. మెయిన్ పైప్ లైన్ సైతం మూడు నాలుగు ఫీట్ల లోపే గుంతలు తీసివేయడంతో పదేపదే లీకేజీలవుతున్నాయి. నల్లా కనెక్షన్ ఇచ్చిన అధికారులు కనీసం నాలుగు బిందెల నీళ్ల వచ్చేలా చర్యలు చేపట్టలేక పోతున్నారు. ఈ కనెక్షన్లు ఇచ్చే సమయంలో అందరికీ సమానంగా నీళ్లు వస్తాయో లేదో కూడా కనీసం పరిశీలించలేదు. దీంతో ప్రస్తుతం ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే ఇంకా రానున్న వేసవికాలంలో అసలు చుక్క నీరు కూడా అందే పరిస్థితి కానరావడం లేదు. వేసవిలో ఎండలు ముదురుతున్న నేపథ్యంలో జీపీ పరిధిలో వేసిన బోరుబావులు సైతం ఎత్తిపోతున్నాయి. అధికారులు స్పందించి కనీసం వారానికి మూడు నాలుగు రోజులైనా మిషన్ భగీరథ నీళ్లు అందించాలని ప్రజలు కోరుతున్నారు.



జీపీ బోరుబావి నల్లా నుంచి నీరు తీసుకెళ్తున్న మహిళ

అంతటా సమస్యలే..

కొన్ని ప్రాంతాలలో మిషన్ భగీరథ ట్యాంకులను ఎత్తు ప్రాంతంలో కాకుండా పల్లపు ప్రాంతంలో నిర్మించడం వల్ల ట్యాంకు నిండినా నల్ల కనెక్షన్లకు నీళ్లు రావడం లేదు. మరోచోట ఎత్తైన ప్రాంతంలో మిషన్ భగీరథ ట్యాంకులను నిర్మించడంతో మెయిన్ పైపు ద్వారా మిషన్ భగీరథ ట్యాంకులకు నీళ్లు ఎక్కించే దాంట్లో సమస్యలు తలెత్తుతున్నాయి. ఇళ్లలోకి ఇచ్చే మెయిన్ పైపులు మిషన్ భగీరథ గ్రిడ్ నుంచి వచ్చే మెయిన్ లైన్ పైపులు నిబంధనలకు విరుద్ధంగా పైపైన వేయడంతో పదేపదే లీకేజీల అవడం మరో సమస్యగా మారింది. అధికారులు స్పందించి ఈ సమస్యలు పరిష్కరించి.. ప్రతి ఇంటికి నీరందేలా సత్వరం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఒక్కసారి కూడా నీళ్లు రాలేదు



మిషన్ భగీరథ పథకం ద్వారా వేసిన పైప్‌లైన్ల ద్వారా ఒక్కసారి కూడా నీళ్లు రాలేదు. మిషన్ భగీరథ పైపు లైన్లు నిరుపయోగంగా ఉన్నాయి. ఎండా కాలంలో నీటి సమస్య రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రతి ఏడాది వేసవిలో నీటి తిప్పలు తప్పడం లేదు.

– రాజేందర్, మాజీ ఎంపీటీసీ, మద్దికుంట

ఎస్సీలందరికీ వర్గీకరణ ఫలాలు అందాలి



ఎల్లారెడ్డిరూరల్ : ఎస్సీలలోని అన్ని కులాలకు వర్గీకరణ ఫలాలు అందాలని ఎంఆర్‌పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు అన్నారు. సోమవారం ఎల్లారెడ్డిలో ఎంఆర్‌పీఎస్ అనుబంధ సంఘాల నాయకుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎస్సీ కులాల వారి జనాభా ప్రాతిపదికన ఏ, బీ, సీ, డీగా వర్గీకరించి చట్టం చేయాలని అన్నారు. జస్టిస్ షమీమ్ అక్తర్ కమిటీ లోపాలను సరిచేయాలన్నారు. నాయకులు సామేల్, శివానందం, పద్మారావు, నరేష్, కిషన్ తదితరులున్నారు.

మాచారెడ్డి: ఎస్సీ వర్గీకరణలో భాగంగా ఈ నెల 4 నుంచి 10 వరకు మండల కేంద్రాల్లో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ ప్రదర్శనలను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ కామారెడ్డి జిల్లా పర్యవేక్షకులు మంథని సామేల్ మాదిగ కోరారు. సోమావారం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మండల శాఖ అధ్యక్షుడు బట్టు రమేష్ను పరామర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. జిల్లా నేత సట్టిగారి లక్ష్మి మాదిగ, బానపురం లావణ్య మాదిగ, కాస్తారి శైలేష్ మాదిగ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



బాన్సువాడ: ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని మైనార్టీ ఉద్యోగుల సంఘం డివిజన్ కార్యదర్శి హాజీ అన్నారు. బాన్సువాడలో డీఎస్సీ–2024లో నూతనంగా ఎంపికైన ఉర్దూ మీడియం ఎస్‌జీటీల కు 3 రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించా రు. అందులో భాగంగా ఉర్దూ మీడియం ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడారు. మైనార్టీ ఉద్యోగుల కు ఎలాంటి సమస్యలు వచ్చినా సంఘాన్ని సంప్రదించాలన్నారు. సంఘం నాయకులు మొహమ్మద్ అక్బర్, సయ్యద్ అబ్దుల్ రజాక్ ఉన్నారు.

బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలి



రామారెడ్డి: మండల కేంద్రంలోని గంగమ్మ వాగుపై బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ ఈఈ కార్యాలయానికి బీఆర్ఎస్ నేతలు సోమవారం వెళ్లి వినతి పత్రం అందజేశారు. ఈఈ సెలవులో ఉండడంతో ఫోన్లో మాట్లాడి సమస్య పరిష్కరించాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ... వేసవి తర్వాత వర్షాకాలం వస్తున్నందున బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కోరారు. సదాశివనగర్ మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర రావు, కాలభైరవ స్వామి టెంపుల్ మాజీ చైర్మన్ గంజి సతీష్ గుప్తా, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పడిగెల శ్రీనివాస్, జంగం లింగం పాల్గొన్నారు.

ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తుదారులకు 25 శాతం ఫీజు రాయితీ

ఎల్లారెడ్డిరూరల్: ఎల్‌ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్లాటు యజమానులకు ప్రభుత్వం ఫీజు చెల్లింపులో రాయితీ ప్రకటించిందని మున్సిపల్ కమిషనర్ మహేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 1 నుంచి 31లోగా పూర్తి స్థాయిలో ఫీజు చెల్లించిన వారికి ప్రభుత్వం 25 శాతం రాయితీ ప్రకటించిందని పేర్కొన్నారు.

హామీలు అమలు చేసే వరకు పోరాటం

- మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

కామారెడ్డి క్రైం: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు పోరాటం చేస్తూనే ఉంటామని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. కామారెడ్డిలోని ఆయన నివాసం వద్ద బీఆర్ఎస్ పార్టీ క్యాలెండర్, డైరీలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను గాలికి వదిలి కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ప్రతి హామీని అమలు చేసే వరకు ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దేశంలోనే అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై కేసీఆర్, కేటీఆర్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్ రెడ్డి, నాయకులు బాలచంద్రం, బాలమణి, మధుసూదన్ రావు, అధికార ప్రతినిధులు బల్వంత్ రావు, గైని శ్రీనివాస్, భాను, తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ డైరీలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే

బీఆర్ఎస్ పార్టీని ప్రజలు కోరుకుంటున్నారు

బాన్సువాడ రూరల్: బీఆర్ఎస్ పార్టీని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారని హన్మాజీపేట్ గ్రామ బీఆర్ఎస్ యువజన అధ్యక్షులు అజ్జిగ భాస్కర్ అన్నారు. గ్రామంలో గాంధీ కూడలిలో సోమవారం ఆయన బీఆర్ఎస్ పార్టీ క్యాలెండర్లు, డైరీలను కార్యకర్తలకు పంచిపెట్టారు. నాయకులు బేగరి శివరాజులు, ఆకుల సాయిలు, శివ, కాశీరాం, గణేష్, రత్న, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

నస్రుల్లాబాద్‌లో..

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో బీఆర్ఎస్ పార్టీ క్యాలెండర్లను కార్యకర్తలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు నర్సింలు గౌడ్ మాట్లాడుతూ.. మళ్లీ కేసీఆర్ పాలనే కావాలని ప్రజలు కోరుతున్నారన్నారు. స్థానిక నాయకులు టేకుర్ల సాయిలు, మోసిన్, శేఖర్, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గించొద్దు



మాట్లాడుతున్న ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు

లింగంపేట(ఎల్లారెడ్డి): రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ప్రజలు శాంతియుతంగా పండుగలను జరుపుకోవడానికి పోలీసులు భరోసా కల్పిస్తున్నట్లు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో నాలుగు కిలో మీటర్ల ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అనంతరం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. ప్రతీ ఒక్కరూ పండగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవడానికి పోలీసులు సహకరిస్తున్నట్లు తెలిపారు. యువకులు మత విద్వేశాలు రెచ్చగొట్టే విధంగా ప్రకటనలు, మాట్లాడడం చేయవద్దన్నారు. అలాగే ట్విట్టర్, ఫేస్‌బుక్, వాట్సాప్ గ్రూపుల్లో మతపరమైన మెసేజ్‌లు పెడితే అడ్మిన్‌లను బాధ్యులను చేసి చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సై వెంకట్రావు, బెటాలియన్ చీఫ్ కమాండర్ బాగెల్, రిజర్వు ఎస్సై సాయి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్ల పరిశీలన

సాక్షి స్పందన

నిజాంసాగర్(జుక్కల్): మల్లూర్ తండాను సోమవారం ఎంపీడీవోలు గంగాధర్, అనిత, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ సుమలత సందర్శించారు. తండాలో తాగునీటి ఇబ్బందులు అంటూ ఆదివారం సాక్షి దినపత్రిక లో వచ్చిన కథనానికి మండల అధికారులు స్పందించారు. తండాలోని రక్షిత ట్యాంకుకు నీటిని సరఫరా చేసే పైపులైన్ పరిశీలించారు. కొత్తగా బోరు మోటార్ కొనుగోలు చేసి తండాలోని ప్రజలకు తాగునీటి ఇబ్బందులను దూరం చేశామని అధికారులు తెలిపారు.



మల్లూర్‌తండాలో అధికారులు

ఆధ్యాత్మికం..

ప్రారంభమైన పెద్దమ్మ ఉత్సవాలు

రాజంపేట: సిద్దాపూర్‌లో నేటి(సోమవారం)నుంచి పెద్దమ్మ దేవి ఉత్సవాలు ప్రారంభమైనట్లు గ్రామ ముదిరాజ్ సంఘ సభ్యులు తెలిపారు. శుక్రవారం వరకు ఈ ఉత్సవాలు జరగనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా విగ్రహాల ప్రతిష్ఠాపనతో పాటు పెద్దమ్మ, పెద్దిరాజుల కల్యాణం, బోనాల ఊరేగింపు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

భక్తి శ్రద్ధలతో పుత్రకామేష్టి యాగం



కామారెడ్డి అర్బన్: సంతానం కోసం పరితపించే దంపతులకు పుత్రకామేష్టి సామూహిక యాగం ఉత్తమ ఫలితం ఇస్తుందని వేదపండితులు జి.ఆంజనేయశర్మ అన్నారు. కామారెడ్డి పశ్చిమ హౌసింగ్ బోర్డు కాలనీలోని సంకష్టహర మహాగణపతి ఆలయంలో సోమవారం పుత్రకామేష్టి మహాయాగం నిర్వహించగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన 121 దంపతులు భక్తిశ్రద్ధలతో యాగంలో పాల్గొన్నారు. 18 సంవత్సరాలుగా ఏడాదికి ఒకసారి యాగం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు సుతారి అంజయ్య, బి.రవీందర్‌గౌడ్, బి.విశ్వనాథంలు తెలిపారు.

గీతా భవనంలో శ్రీమద్ భగవద్గీత సప్తాహం



కామారెడ్డి అర్బన్: స్థానిక సిరిసిల్లరోడ్డులోని శ్రీకృష్ణ గీతామందిరం 23వ వార్షికోత్సవం సందర్భంగా వారం రోజుల శ్రీమద్ భగవద్గీత సప్తాహం సోమవారం సాయంత్రం ప్రారంభమైంది. ప్రతిరోజు ఉదయం 6:30 గంటల నుంచి 8 గంటల వరకు ధ్యానం, కఠోపనిషత్తు, సాయంత్రం 5:30 గంటల నుంచి 7 గంటల వరకు భగవద్గీతపై ప్రవచనాలు చేస్తారని గీతా మందిరం ప్రధాన కార్యదర్శి అర్వపల్లి రమేష్ తెలిపారు. 9న ఉదయం దేవ యాగం, మహాప్రసాదం ఉంటుందన్నారు.

కోట దుర్గమ్మ ఆలయంలో రుద్ర హోమం



బాన్సువాడ: పట్టణంలోని కోట దుర్గమ్మ ఆలయంలో సోమవారం రుద్ర హోమం నిర్వహించారు. ఆలయ ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా ఆలయంలో ఉదయం దుర్గమ్మకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు, రుద్ర హోమం నిర్వహించారు. దండి సుదర్శన స్వామి ఆధ్వర్యంలో భక్తులకు ప్రవచనాలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఉప్పరి లింగం, పత్తి శ్రీకాంత్, బిట్ల సురేందర్ తదితరులున్నారు.

తిర్మలాపూర్‌లో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



బాన్సువాడ రూరల్: తిర్మలాపూర్‌లో లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను శ్రీసేనాపతి పంపతాచార్యుల ఆధ్వర్యంలో ప్రారంభించారు. మంగళవారం ఆవాహిత దేవతాహోమం, శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవం ఉంటుందని ఆలయ నిర్వాహకులు శంకర్‌గౌడ్ తెలిపారు.

శివాలయంలో రుద్రాభిషేకం



నస్రుల్లాబాద్(బాన్సువాడ): నెమ్లిలో గల పంచముఖ శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో శివ లింగానికి రుద్రాభిషేకం చేశారు.

శాలివాహన సంఘం కార్యవర్గం ఎన్నిక



ప్రభాకర్

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట పట్టణ శాలివాహన కుమ్మరి సంఘం యూత్ కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుమ్మరి ప్రభాకర్, ఉపాధ్యక్షుడు నరేశ్, ప్రధాన కార్యదర్శిగా వేణు, కోశాధికారిగా రవీందర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

చిట్టెపు రెడ్డి సంఘం..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్ ఎల్లారెడ్డిలో సోమవారం చిట్టెపు రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దుబ్బాక నర్సారెడ్డి, ఉపాధ్యక్షుడిగా మహిపాల్, కోశాధికారులుగా గంపల శ్రీనివాస్ రెడ్డి, దొంతి మహేశ్ రెడ్డి, కార్యదర్శిగా వాదుల ప్రవీణ్ రెడ్డి, సలహాదారులుగా సత్యనారాయణ రెడ్డి, సాగర్ రెడ్డి, రాజిరెడ్డి, శివారెడ్డి, కొండల్ రెడ్డి, మహిపాల్‌రెడ్డి, బాల్‌రెడ్డి, గోపాల్ రెడ్డి, తిరుపతి రెడ్డిలను ఎన్నుకున్నారు.



దుబ్బాక నర్సారెడ్డి

సంక్షిప్తం

ఇష్టంతో చదవాలి



మాచారెడ్డి: విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి తల్లిదండ్రుల కళ్లల్లో ఆనందాన్ని చూడాలని మండల విద్యాధికారి దేవేందర్ రావు సూచించారు. సోమవారం ఘన్పూర్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు ప్రార్థనా సమయానికి రావాలన్నారు. తరగతుల వారీగా విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. హెచ్ఎం శారద, ఉపాధ్యాయులు నవనీత, సంతోష్, రజిత, రమా, గోపాలకృష్ణ ఉన్నారు.

స్వయం పాలన దినోత్సవం



కామారెడ్డి టౌన్: మున్సిపల్ పరిధిలోని రామేశ్వరపల్లి మండల పరిషత్ యూపీఎస్‌లో సోమవారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులుగా పిల్లలకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు వల్ల విద్యార్థుల్లో ధైర్యం, విషయ పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు గిరి, సహదేవ్, సురేష్, కల్పన, అరుంధతి, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

మాచారెడ్డి: లచ్చాపేట ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సోమవారం కామారెడ్డికి చెందిన హెల్పింగ్ బ్రిడ్జి ఫర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. పదో తరగతి అనంతరం ఎంచుకోవలసిన అంశాలపై విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాజేశ్వర్‌రెడ్డి, సొసైటీ ప్రతినిధులు జూకంటి అనిల్ రెడ్డి, కృష్ణాకర్, కృష్ణారావు, రజనీకాంత్, నవీన్, శ్రీకాంత్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్గదర్శనం పోస్టర్ల ఆవిష్కరణ

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం దోస్త్‌పల్లి ఉప పీఠంలో సోమవారం నరేంద్ర చార్యాజీ మహరాజ్ మార్గదర్శనం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 6, 7 తేదీల్లో తెలంగాణ ఉప పీఠం ఆధ్వర్యంలో సమస్య మార్గదర్శనం, దర్శన కార్యక్రమం ఉంటుందని ఉప పీఠం సేవా సమితి సభ్యులు తెలిపారు. భక్తులు మార్గదర్శనానికి తరలివచ్చి మహరాజ్ ఆశీర్వాదం పొందాలని వారు కోరారు.



రికవరీ సెల్ ఫోన్ అప్పగింత

మాచారెడ్డి: పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను సీఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసి సోమవారం బాధితుడికి అప్పగించినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. పాల్వంచ మండలం దేవునిపల్లి గ్రామానికి చెందిన కామటి భిక్షపతి ఇటీవల తన సెల్ ఫోన్ పోయినట్లు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై వివరించారు.